

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



## పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 279 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 23-04-2025 | పేజీలు : 6


# ఢిల్లీలో కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ

### రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు సాయం అందించాలని కోరిన సీఎం

**ఢిల్లీ, ఏప్రిల్ 22 (జనస్వరం) :** సీఎం చంద్రబాబు ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, కేంద్ర పథకాలపై కేంద్ర మంత్రులతో మంగళవారం చర్చించారు. విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు.. నలుగురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. ముందుగా కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌తో భేటీ అయిన చంద్రబాబు జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్ర నిధుల మంజూరుపై చర్చించారు. కేంద్ర పథకమైన జల్ జీవన్ మిషన్‌ను రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్న సీఎం.. ఈ పథకానికి నిధుల విడుదలపై కేంద్ర మంత్రితో చర్చించారు. అదే విధంగా రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపైనా కేంద్ర జలశక్తి మంత్రికి వివరించి.. ఈ ప్రాజెక్టుకు సాయం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే కలిగే ప్రయోజనాలు సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. అదేవిధంగా కేంద్ర అటల్ భూజల్




యోజన్ కార్యక్రమంపై భేటీలో చర్చించారు. భూగర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన సీఎం.. ఈ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సీఎం సమావేశం అయ్యారు. కర్నూలులో హై కోర్టు బెంచ్ అంశంపై ఆయనతో చర్చించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ అమలు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు...అమెరికా సుంకాల కారణంగా రాష్ట్రంలో ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. భారతదేశ సీ ఫుడ్స్‌పై విధించిన 26 శాతం సుంకాలు ఏపీలోని ఆక్వా రంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని సీఎం వివరించారు. ఈ విషయంలో అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. దీని కోసం తీసుకోవాల్సిన స్వల్ప కాలిక, మధ్యస్థ, దీర్ఘకాలిక చర్యల గురించి పలు ప్రతిపాదనలు సూచించారు. అనంతరం సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ భేటీ లలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు పాల్గొన్నారు.

## అగ్నిమాపకశాఖ పనితీరుపై హోం మంత్రి అనిత ఫైర్



**విజయవాడ, ఏప్రిల్ 22 (జనస్వరం) :** అగ్నిమాపక శాఖ పనితీరుపై ఏపీ హోం మంత్రి అనిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఉన్నతాధికారులపైనా విమర్శలున్నాయని, పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలకు వెనకాడబోనని హెచ్చరించారు. గత వైకాపా ప్రభుత్వం అగ్నిమాపక శాఖను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. శాఖ పనితీరుపై ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. కొత్తగా 22 అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 122 అగ్నిమాపక వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రాణాలకు తెగించి పోరాడే అగ్నిమాపక సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అగ్నిమాపకశాఖపై హోం మంత్రి అనితకు గత కొంతకాలంగా వరుస ఫిర్యాదులు వస్తుండటంతో.. ఆమె సమీక్ష నిర్వహించారు. సిబ్బంది సంక్షేమ నిధులను ఓ ఉన్నతాధికారి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, 15 నెలల వ్యవధిలో రూ.లక్షల్లో బిల్లులు డ్రా చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయని, దీనిపై ఏం సమాధానం చెబుతారని అధికారులను ఆమె నిలదీశారు. ఇంతకుముందే సమీక్ష నిర్వహించాలని భావించినా అధికారులు దాటవేస్తూ వచ్చారు. ఇవాళ సమీక్ష నిర్వహించిన హోం మంత్రి అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఫైర్స్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

# 38 కత్తిపోట్లు



- టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి దారుణ హత్య
- ఒంగోలు నడిబొడ్డున ఘటన
- ఉలిక్కిపడిన నగరం
- కార్యాలయంలో ఉండగానే కత్తులతో గుర్తుతెలియని దుండగులు దాడి
- కిరాయి హంతకుల పనిగా భావిస్తున్న పోలీసులు
- మృతదేహం రిమ్స్‌కు తరలింపు
- భారీగా తరలివచ్చిన నేతలు, పార్టీ శ్రేణులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ దామోదర్
- తక్షణమే దర్యాప్తు ప్రారంభం
- గుండెపోటుకు గురైన వీరయ్య మేనమామ ఈదర

**ఒంగోలు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ఒంగోలు నగరంలో దారుణం చోటు చేసుకుంది. టీడీపీ ముఖ్యనేత, ఎన్‌జీపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు గురయ్యారు. వంటిపై మొత్తం 38 కత్తిపోట్లు ఉండటాన్ని బట్టి చూస్తే ఆయన్ను ఎంత కర్కశంగా పొడిచారో అర్థమవుతోంది. ఈ ఘటనతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. యావత్తు పార్టీశ్రేణుల్లో ఆందోళన నెలకొంది. నగరంలోని పాత బైపాస్ రోడ్డులోని వీరయ్య కార్యాలయంలోకి ప్రవేశించిన నలుగురు యువకులు కత్తులతో విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 7.30 ప్రాంతంలో ఈ హత్య జరిగింది. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వీరయ్య చౌదరి దాదాపు మూడు దశాబ్దాలకుపైగా ఒంగోలు నగరంతోపాటు ఉమ్మడి జిల్లాలోని రాజకీయ, వ్యాపార వర్గాల వారందరికీ సుపరిచితుడు. జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు దగ్గర బంధువుగా తొలుత ప్రజలకు పరిచయమైన వీరయ్యచౌదరి క్రమంగా రాజకీయ వ్యాపార వర్గాల్లో ఎదుగుతూ వస్తూ ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతగా బాపట్ల పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గతంలో 2014-19 మధ్య నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేసిన వీరయ్యచౌదరి గత పదేళ్లుగా రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. స్వతహాగా మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఈ వ్యాపారంలో కొనసాగుతున్న వీరయ్యచౌదరికి ఆ వ్యాపారాలు ఇతరత్రా వర్గాల వారితో విభేదాలు కూడా ఉండే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మద్యం వ్యాపారం చేపట్టారు. అలాగే టీడీపీలో చురుగ్గా వ్యవహరిస్తూ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరయ్య హత్యకు గురికావడం ఉమ్మడి జిల్లాలోని టీడీపీ శ్రేణులను కలవరపాటుకు గురిచేయగా ఊహించని రీతిలో జరిగిన హత్యతో ఒంగోలు ప్రజానీకం ఉలిక్కిపడ్డారు.

**సొంత కార్యాలయంలోనే.. :**

స్థానిక పాత బైపాస్ రోడ్డులో చాలాకాలంగా సొంత కార్యాలయాన్ని నిర్వహిస్తున్న వీరయ్య చౌదరి పగలంతా రాజకీయ, వ్యాపార కార్యక్రమాలను చూసుకుని సాయంత్రానికి ఆ కార్యాలయానికి వచ్చి తన వ్యక్తిగత పనులు చూసుకుంటుంటారు. అలాగే మంగళవారం సాయంత్రం కూడా వీరయ్య కార్యాలయంలో తన పనులు చూసుకుంటుండగా గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడి కత్తులతో దాడిచేశారు. అందిన సమాచారం మేరకు.. రెండు బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు రాత్రి 7.30 ప్రాంతంలో కార్యాలయంలోకి ప్రవేశించి ప్రధాన ద్వారానికి గడియ పెట్టి రూములో ఉన్న వీరయ్యపై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచారు. గుండెలో, మెడ, గొంతు ప్రాంతంలో దాదాపు 20కిపైగా కత్తిపోట్లు ఉన్నట్లు చెప్తున్నారు. దాడిలో వీరయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. అనంతరం దుండగులు అక్కడి నుంచి పారిపోగా కొంత సేపటి తర్వాత పోలీసులకు విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటన జరిగిన వీరయ్య కార్యాలయం ఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే ఉండగా విషయం తెలిసిన వెంటనే ఎస్పీ ఏఆర్.దామోదర్, ఇతర పోలీసు అధికారులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం వీరయ్యచౌదరి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి తక్షణమే దర్యాప్తు చేపట్టారు. ఆరుగురు సీఐలు, 10మంది ఎస్ఐలతో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా ఘటన జరిగిన తీరును బట్టి హత్య చేసిన వారు ప్రొఫెషనల్ హంతకులుగా పోలీసులు భావిస్తున్నారు.


**ఆర్థిక లావాదేవీలేనా? :**

మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో వీరయ్య చురుగ్గా ఉండగా ఆ వ్యాపారాలు, అలాగే ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయా? అలాంటి వివాదాలే ఈ హత్యకు కారణమై ఉండొచ్చన్న అనుమానంతో ఆ వైపు దర్యాప్తుపై దృష్టిసారించారు. అలాగే బైపాస్‌కు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. విషయం తెలిసి వీరయ్య కార్యాలయం దగ్గరకు పెద్దసంఖ్యలో జనం చేరగా వారందరినీ దూరంగా పంపించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**తరలివచ్చిన నాయకులు :**

వీరయ్యచౌదరి హత్యకు గురయ్యాడన్న వార్త కొద్దిసేపటికే ఒంగోలు నగరంతోపాటు జిల్లా అంతటా వ్యాపించింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించడంతో అక్కడికి ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, పార్టీశ్రేణులు భారీగా తరలివచ్చారు. మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు బీఎన్ విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌లతోపాటు అనేకమంది ముఖ్యనాయకులు రిమ్స్ వద్దకు తరలివచ్చారు. వీరయ్య మృతదేహానికి నివాళులర్పించటంతోపాటు హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఇటు రిమ్స్‌లోనూ, అటు ఘటన జరిగిన వీరయ్య కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో ప్రజానీకం ఉన్నారు. స్వగ్రామమైన అమ్మనబ్రోలుతోపాటు నాగులుప్పలపాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు రిమ్స్‌కు భారీగా తరలివచ్చారు. రాత్రి 9గంటల ప్రాంతంలో ఎస్పీ దామోదర్ రిమ్స్ వద్దకు వచ్చి అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పోలీసుల సమాచారం ప్రకారం సంఘటన జరిగిన తీరు అనంతరం దర్యాప్తుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించినట్లు సమాచారం.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 23 ఏప్రిల్ 2025,**

**తిథి : శుద్ధ దశమి (సా.04:49వ.కు),**

**నక్షత్రం : ధనిష్ట (మ.12:11వ.కు)**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:15ల తె.05:042**

**రాహుకాలం : మ.12:06ల మ.01:40,**

**యమగండం : ఉ.11:41ల మ.12:31,**

**వర్జ్యకాలం : రా.07:04ల రా.08:47,**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 23 ఏప్రిల్ 2025,**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:47**

**సూర్యోదయం : ఉదయం గం. 06:01**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:18**

**అసర్ : సాయంత్రం గం. 03:28**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:35**

**ఇష : రాత్రి గం. 07:50**





## జన స్వరం

## విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ గ్రాఫ్ వర్సెస్ బాబు గ్రాఫ్.. ఎలా ఉన్నాయ్ ..!



## ఎడిటోరియల్

నాయకులన్నాక.. ప్రజల మధ్య చర్చ ఉంటుంది. వారిచ్చే మార్కులు కూడా అవసరం. ఒకప్పుడు నాయకులు.. ప్రజల ఆలోచనలు వేరేగా ఉండేవి. ఎన్నికలకు ఏడాది ముందు నాయకులకు ప్రజల్లో మార్కులు ఎలా ఉన్నాయనే చర్చ ఉండేది. పార్టీలు కూడా..ఎన్నికలకు ముందు అప్రమత్తం అయ్యేవి. కానీ.. ఇప్పుడు అలా కాదు. ఎన్నికలకు కనీసం మూడేళ్ల నుంచే పార్టీలు, నాయకులు కూడా అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రజల్లో తమ గ్రాఫ్ పడిపోకుండా పెంచుకునే వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. గత టీడీపీ అయినా.. ప్రస్తుత తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అయినా.. ఈ గ్రాఫ్ విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నాయి. సమస్యల మాట ఎలా ఉన్నా.. తాము సమస్యల్లో చిక్కుకోకుండా.. జాగ్రత్తలు పడ్డాయి. ఎన్నికలకు మూడేళ్ల ముందు నుంచే టీడీపీ అలెర్ట్ అయింది. ఇక, బీఆర్ ఎస్ పార్టీ అయితే.. నాలుగేళ్ల ముందే అలెర్ట్ అవుతూ.. ప్రజల మధ్యకు వచ్చింది. మరి ఇలా చూసుకుంటే.. వైసీపీ అధినేత.. జగన్.. ఆయన పార్టీ.. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ పరిస్థితి ఎలా ఉన్నాయి? ఇప్పటికి ఏపీలో ఎన్నికలు ముగిసి ఏడాది అయింది. మరో నాలుగేళ్ల వరకు ఎన్నికలు లేవు. అలాగని కూర్చుంటే.. నాయకుల గ్రాఫ్ పరిస్తితి దారుణంగా ఉండే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకునే.. సీఎం చంద్రబాబు తరచుగా తనను తాను పరీక్షించుకుంటున్నారు. తన పాలనను పరిశీలించుకుంటు న్నారు. తద్వారా ప్రజల్లో తన ఇమేజ్ దెబ్బ తినకుండా.. గ్రాఫ్ పడిపోకుండా కూడా. ఆయన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రజల మధ్య ఉంటున్నారు. కానీ.. వైసీపీ అధినేత జగన్ మాత్రం.. ఈ విషయాన్ని లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయన ఈ గ్రాఫ్‌లు.. లెక్కలు వేసుకోవడం లేదు. అంతా..ఎన్నికలకు ముందు చూసుకుందాం.. అనుకున్నారో ఏమో.. తెలియదు.. కానీ, ప్రజలను పూర్తిగా పక్కన పెట్టారు. దీంతో ఇప్పుడు గ్రాఫ్ ధమాల్‌న పడిపోయిందన్న చర్చ సొంత పార్టీలోనే వినిపిస్తోంది. చంద్రబాబు ఇమేజ్ రోజు రోజుకు పెరుగుతుండగా.. జగన్ ఇమేజ్ అంతకు రెండింతల స్థాయిలో తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం జగన్‌కు 10 శాతం మేరకు మాత్రమే పాజిటివిటీ ఉందని తెలుస్తోంది. చంద్రబాబుకు ఎన్నికలకు ముందున్న 80 శాతం పాజిటివిటీ.. కొంత తగ్గుతూ.. మరింత పెరుగుతూ.. 80 శాతం దగ్గర నిలకడగా ఉందన్న చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో జగన్ అలెర్ట్ కాకపోతే.. ఎన్నికల సమయానికి మరింత పడిపోయే అవకాశం ఉందని పార్టీ నాయకులు గుసగుస లాడుతున్నారు.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## మలేరియా నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రతి ఒక్కరూ మలేరియా నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఖాజా మొయిద్దీన్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మలేరియా నివారణ, లక్షణాలు, చికిత్సపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ప్రత్యేక ప్రసంగాలు, సమాచార లఘుచిత్రాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాజా మొద్దీన్ మాట్లాడుతూ మలేరియాను సమర్థవంతంగా నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాకరాపురం వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, ప్రేమలత పాఠశాల ప్రిన్సిపల్ హరిత, ఆశా కార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన



**పులివెందుల ఏప్రిల్ 22 (జనస్వరం) :** నియోజకవర్గంలోని తొందూరు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ 7వ పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా వెయ్యి రోజుల సంరక్షణ గురించి ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుండి బిడ్డకు 2సంవత్సరాలు పూర్తీ అయ్యే కాలాని 1000 రోజుల సంరక్షణగా పరిగణింపబడుతుందన్నారు. గర్భిణి ప్రతిరోజు తినే ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు పండ్లు తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా కూడా పైన చెప్పినవి తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టినప్పటి నుండి 6 నెలల పాటు పూర్తిగా తల్లిపాలు పట్టాలని, 7వ నెల నుండి తల్లి పాలతో పాటు అదనపు ఆహారం పెట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి భారతి, రాధారాణి, సూపర్ వైజర్ రమణమ్మ,అంగన్వాడి కార్యకర్తలు సుజాత, గురుతేజ, గాయత్రి గర్భిణిలు,బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## పట్టు జారిందా.. ప్రాణాలు గోవిందా..



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నా ఆ మేరకు ప్రజల్లోకానీ ఆటో డ్రైవర్లలో కానీ అవగాహన రాలేదు. ఇందుకు వేంపల్లి ప్రాంతంలో కిక్కిరిసిన కూలీలతో వెళ్తున్న ఆటో ఓ ఉదాహరణ. అధికలోడు చట్టరీత్యా నేరమని తెలిసినా వాటి నిబంధనల గురించి డ్రైవర్లు ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఏడాది క్రితం పట్టణ శివార్లలో ఇలాగే కిక్కిరిసి కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక వైపు నుంచి లారీ ఢీకొనడంలో ఇరువురు మహిళలు మృతి చెందారు. కిక్కిరిసిన ప్రయాణం ప్రమాదమని తెలిసినా పరివర్తనలో మాత్రం మార్పు రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలను వ్యతిరేకించే ఆటోలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రయాణికులు కూడా ఇటువంటి వ్యవహారంలో మార్పు రావాలి. అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ఉమ్మడి కడప జిల్లాలోని కోడూరు శాంతినగర్ బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి డివైడర్ ఢీకొనడంతో చియ్యవరం పంచాయతీ నడింపల్లికు చెందిన చరణ్ (28) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నవీన్ బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల జీవన పరిస్థితులు మెరుగుపరుస్తాం

**నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేసిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్..**



**ఏలూరు/బట్టాయిగూడెం, ఏప్రిల్ 22 (జనస్వరం) :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని నిర్వాసితుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ బహుళార్ధసాధక సాగునీటి ప్రాజెక్ట్ అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ భూములు త్యాగంచేసిన 35 వేల మంది నిర్వాసితుల త్యాగాలను తమ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని, వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల పోలవరం పర్యటన సందర్భంగా నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారని, వాటిపై సీఎం సానుకూలంగా స్పందించి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. నిర్వాసితులకు ఆహార భద్రతాకీ అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందజేసి వారికి ప్రతినెలా 35 కేజీల బియ్యన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిర్వాసితుల కుటుంబాలలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సర్వేని నిర్వహిస్తామన్నారు. పునరావాస కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా, వైద్యం తదితర మౌలిక సదుపాయాలను ఆరు నెలలులోగా కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాలనీలలో ఎట్టిపరిస్థితులలోను తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పోలవరం నియోజకవర్గంలో రోడ్డు అభివృద్ధికి గత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 27 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 20 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. నిర్వాసితులకు నిబంధనల మేరకు పరిహారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. రాష్ట్రంలో 4.64 కోట్ల రైస్ కార్డు హోల్డర్లకు ప్రతినెల బియ్యన్ని అందిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీని త్వరలో చేపడతామని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమాన ప్రాధాన్యతనిస్తుందని, రాష్ట్రంలోని 63 లక్షల మందికి ప్రతినెల రూ.2700 కోట్లను పెన్షన్లుగా అందిస్తున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండి రూ.9600లతో తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో పథకం వర్తింపజేస్తామన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందించాలని సీఎం ఆదేశించిన వెంటనే పునరావాస కాలనీలో మొదటి విడతలో సర్వే చేసి కార్డులు అందిస్తున్నామని, ఇంకా అర్హులైవరైనా ఉంటే వారికి కూడా అందిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ ముంపు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అంత్యోదయ అన్నా యోజన అర్హులని గుర్తించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీతో పాటు ఆయా కుటుంబాలు జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నమన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పేదల, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. ఎన్నడూలేని విధంగా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి 6 నుండి 24 గంటలలోగా వారి ఖాతాలకు కూటమి ప్రభుత్వం సొమ్ము జమచేసిందన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతకు, పెళ్ళైనవారికి కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అందించాలన్న నిర్వాసితుల విజ్ఞప్తిని పరిలిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఐటీడీఏ పీఓ రాములు నాయక్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్డీఓ ఎం.వి. రమణ, తహశీల్దారు అచ్యుత్, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, గడ్డమనుగు రవి కుమార్, చింతలపూడి జనసేన ఇంచార్జీ మేకా ఈశ్వరయ్య, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, గోపాలపురం జనసేన ఇంచార్జీ దుద్దిగర్ల సువర్ణ రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లులో ఆన్లైన్ బెట్టింగ్ ముఠా..!?

- **పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు**
- **అజ్ఞాతంలో వైసీపీ నేత యడ్ల సోదరులు**
- **వివరాలు వెల్లడించిన నరసాపురం డీఎస్పీ శ్రీవేద**



**పాలకొల్లు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా, ఆడినా, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు ఆన్లైన్ బెట్టింగ్ కు దూరంగా ఉండాలని, యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నర్సాపురం డీఎస్పీ శ్రీ వేద అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఒక ప్రెస్‌నోట్‌ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్, విశాఖ కేంద్రాలుగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు యడ్ల తాతాజీ, యడ్ల నాగేశ్వరరావులు ప్రస్తుతం అప్ స్కాండ్‌లో ఉన్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. అన్నదమ్ములిద్దరూ పదేళ్లుగా బెట్టింగ్ నడుపుతున్నట్టు తెలిపారు. వీరి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామన్నారు. ఆదివారం పట్టణంలోని బ్రాడీపేట బైపాస్ రోడ్డు వద్ద గురుకుల పాఠశాల సమీపంలో టి–జంక్షన్ వద్ద ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఎం.వెంకట్రావు, వై.వెంకట మురళీకృష్ణను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు కొంతకాలంగా ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. బెట్టింగ్ లో పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన సాయి, కోటి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం, రాజోలుకు చెందిన హనుమ, మలికిపురానికి చెందిన శ్రీనుతో పాటు పలువురు ఉన్నట్టు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని వారిని త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామనీ డీఎస్పీ శ్రీవేద వెల్లడించారు. నిందితుల నుంచి రెండు ల్యాప్ టాప్స్, 10 మొబైల్ ఫోన్లు, రూ.33 వేల నగదు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్న పాలకొల్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్, ఎస్ఐ ప్రసాద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వైసీపీ నాయకుడు తాతాజీ ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ర్యాకెట్టు సూత్రధారిగా పోలీసులు గుర్తించడంతో, ఈ విషయం పాలకొల్లు పట్టణ పరిసర ప్రాంతాలలో సంచలనంగా మారింది. తాతాజీ పది రోజులుగా అజ్ఞాతంలో ఉన్నట్టు, ఆయన ఫోన్లు స్విచ్ ఆఫ్ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే కీలక నిందితులు అందరినీ అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ శ్రీ వేద స్పష్టం చేశారు

## నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ ఇకపై ప్రతి శుక్రవారం

- **ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు గ్రీవెన్స్ శుక్రవారానికి మార్పు**
- **ప్రతి సమస్య పరిష్కరించే దిశగా కూటమి అడుగులు**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**

**మంగళగిరి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు ప్రతి బుధవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు శుక్రవారానికి మార్చారు. నియోజవర్గాల్లో స్వీకరించిన వినతులను.. అలాగే పరిష్కరించిన సంఖ్య తదుపరి వారం నివేదికను టీడీపీ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు తెలిపారు. కార్యకర్తల సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ, పార్టీ సంస్థాగత నిర్మాణం బలోపేతం, వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించడం ఈ సమావేశాల లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి సంస్థాగత పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ సమావేశానికి తప్పనిసరిగా ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి హాజరైన, హాజరు కానీ వారి వివరాలను, అలాగే సమావేశం ముఖ్యమైన మినిట్స్‌ను కేంద్ర కార్యాలయానికి పంపించాలని, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి**



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యాబోధన చేస్తున్నాయని ఎమ్మెల్సీ హెూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లి తలిశెట్టీ బాలికాల పాఠశాలలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థినిలను అభినందిస్తూ ఉత్తీర్ణత సాధించిన బాలికలకు నగదు ప్రోత్సహం అందజేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్తులను చదివించాలన్నారు. పర్సంటేజ్ కోసం కాఫీలను ప్రోత్సహించద్దు ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నతమైనవన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కలిపిస్తుందన్నారు. 16340 డిఎస్సీ ఉపాధ్యాయ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తుందని తెలిపారు. రాష్టంలో ఎక్కడ ఉపాధ్యాయ కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు చేసేందుకు ఎల్లపుడూ అండగా ఉంటానని హామీనిచ్చారు.

# వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారులు

## అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు



**మంగళగిరి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన పువ్వాడ వెంకట సుబ్బయ్య నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన భార్య పేరు మీద ఉన్న ఆస్తికి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించిన అధికారులు, వ్యక్తులపై చర్యలు తీసుకోమని ఎన్నో సార్లు అర్జీలు పెట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశాడు. అర్జీని స్వీకరించిన ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూస్తామని అర్జీదారునికి హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీ దారుల నుండి వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి తాతయ్య బాబు కృషిచేశారు.

– అన్నమయ్య జిల్లా సంబేపల్లికి చెందిన ముంగర జ్యోతిర్మయి గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పబ్లిక్ రోడ్డును పెద్ద రెడ్డయ్య అనే వ్యక్తి ఆక్రమించుకుంటే.. ఆక్రమణ తొలగించాలని కోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోకపోవడమే కాకా.. ఆక్రమించుకున్న రోడ్డు స్థలానికి జగనన్న గృహాల కోసం డాక్యూమెంట్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందని.. అధికారులు వెంటనే ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

– అనంతపురం జిల్లా కంబదూరు మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన ఎం.లోకన్న గ్రీవెన్స్‌లో అధికారులకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో గత ప్రభుత్వంలో చేపట్టిన భూ సర్వే రైతులను సంప్రదించకుండా చేయడం వలన చాలా మంది రైతులు హద్దులు, దారుల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదు చేశాడు.

– పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన మేళం శివాజీ గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ. తన భార్య నాగ సుభాషిణి సెర్ప్ డిపార్ట్‌మెంట్‌లో గత 18 సంవత్సరాల నుండి పని చేస్తూ.. 2020లో తన తోటి ఉద్యోగస్తులతో వెళ్తుండగా కారు ప్రమాదంలో మరణించిందని.. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని.. ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని అభ్యర్థించారు.

– కడప జిల్లా జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన డి.రామ్ మోహన్ గ్రీవెన్స్‌లో నేతలకు ఫిర్యాదు చేస్తూ.. పెద్ద దండ్లూరు గ్రామ పంచాయితీలోని సర్వే నెంబర్ 313, 314, 316లకు ఎటువంటి డాక్యూమెంట్ లేకుండా అక్రమంగా కొంత మంది ఆన్‌లైన్ చేసుకున్నారని.. దాన్ని డిస్ప్యూట్ ల్యాండ్‌గా పెట్టాలని ఇది వరకు అధికారులకు అర్జీలు పెట్టినా పట్టించుకోలేదన్నారు.

## ఘనంగా కట్ట మైసమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

### పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లోని శ్రీ శ్రీ కోమటికుంట కట్ట మైసమ్మ తల్లి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమన్నారు. అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనడం అదృష్టకరమన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీ సొసైటీ అధ్యక్షులు విఠల్, సీనియర్ నాయకులు వేణు గోపాల్ రెడ్డి, కృష్ణ, మహేష్, సుమన్, శ్రీకాంత్, రామ్ రెడ్డి, నవీన్, ధనుజయ్, ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీ వాసులు, భక్తులు, పిల్లలు, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, స్థానిక నేతలు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి కట్టడాలు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** వైయస్సార్ కడప జిల్లా సిద్ధవటం మండలం శాఖరాజు పల్లె రెవిన్యూ సర్వేనెంబర్ 424/2 ప్లాట్ నెం 47, 48లో నిర్మాణ దశలో ఉన్న తమ ఇంటి కట్టడాలు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ముస్లిం మహిళలు మంగళవారం ఇన్చార్జ్ తహసీల్దార్ మాధవిలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 సంవత్సరంలో తమకు నివాస స్థలాలు ప్రభుత్వం మంజూరు చేసిందని, దానికి సంబంధించిన అనుబంధ పత్రాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆ స్థలంలో పక్కా గృహాలు నిర్మాణం కోసం స్లాబ్ వరకు గోడలు కట్టారు. అయితే సోమవారం సాయంత్రం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం నాదంటూ జేసీబీ యంత్రంతో కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు, సిద్ధవటం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా దౌర్జన్యంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఘనంగా సోషలిస్ట్ రాజ్య నిర్మాత విప్లవ రథసారధి కామ్రేడ్ లెనిన్ జయంతి వేడుకలు




**నంద్యాల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎం.శంకర్ మాట్లాడుతూ మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం సంప్రదాయమన్నారు. రష్యాలో జార్ చక్రవర్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బోల్షివిక్ పార్టీ స్థాపించి ఆ పార్టీ ఆధ్వర్యంలో విప్లవాన్ని విజయవంతంగా నడివిప్లవ యోధుడు కామ్రేడ్ని లెనిన్ అని ఆయన సేవలను కొనియాడారు. ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్ట్ విప్లవాన్ని రష్యాలో విజయవంతంగా నడిపిన అక్టోబర్ విప్లవ రథసారదని పేర్కొన్నారు. శ్రామిక నియంతృత్వం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని సూచించిన మహనీయుడని పేర్కొన్నారు. లెనిన్ విప్లవ సూత్రాలు సిద్ధాంతాలు నేటికీ ఆచరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ఎస్ చౌడప్ప ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం డివిజన్ నాయకులు రాజు లక్ష్మణ్ మనోజ్ వెంకటేశ్వర్లు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రీ పరిరక్షణ అవగాహన దినోత్సవం






**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పురస్కరించుకొని మసీదు బండలో గల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఎర్త్, సముద్రం, పర్యావరణ శాస్త్ర ఆచార్యులు జి. కిషోర్ కుమార్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "ఏప్రిల్ 22వ తారీఖు నాడు ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మద్దతును ప్రదర్శించడానికి ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే వార్షిక కార్యక్రమం ఎర్త్ డే. భవిష్యత్ తరాల కోసం మన గ్రహాన్ని కాపాడుకోవడంలో మన బాధ్యతను ఇది గుర్తు చేస్తుంది. కాలుష్యం, అటవీ నిర్మూలన, వాతావరణ మార్పు, అంతరించి పోతున్న జాతులు వంటి పర్యావరణ సమస్యల గురించి అవగాహన పెంచడానికి ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు భూమి సహజ వనరులను సంరక్షించడానికి, రక్షించడానికి చర్యలు తీసుకోవాలని ప్రోత్సహిస్తుంది. స్థిరమైన పద్ధతులు, విధానాల కోసం ప్రజలను ఏకతాటిపైకి తెస్తుంది కాబట్టి ధరిత్రి దినోత్సవం చాలా కీలకం. పర్యావరణ అవగాహన, క్రియాశీలతను ప్రోత్సహించడం ద్వారా, సానుకూల మార్పును ప్రేరేపించడంలో, మానవాళికి, గ్రహానికి మధ్య లోతైన సంబంధాన్ని పెంపొందించడంలో ధరిత్రి దినోత్సవం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా అందరి చేత పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, రజని, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు పాలం శ్రీను, జిల్ మల్లేష్, కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తిథి భోజనం ఏర్పాటు చేయడం సంతోషం




**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేయడం తమకు సంతోషాన్ని కలిగించిందని ఒంటిమిట్ట మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హరినాథ్ రెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు ఎన్రోల్మెంట్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పెద్దకొత్తపల్లిలో నిర్వహించామన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్చేలా చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు.

## ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, టైలరింగ్, శిక్షణా శిబిరం



**పాలకొల్లు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజి (స్వయం ప్రతిపత్తి)లో ఇంటర్ పాసై విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లోను, కంప్యూటర్‌లోను విద్యార్థులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.తిరువీధుల రాజరాజేశ్వరి తెలియజేశారు. రెండు నెలల టైలరింగ్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా కుట్టుమిషన్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని అందిపుచ్చుకొని స్వయం ఉపాధితో, ఆత్మవిశ్వాసంతో ఇతరులకు ఉపాధి కల్పించే వ్యక్తులుగా రూపొందించాలని ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి ఆకాంక్షించారు. ఆసక్తి గల విద్యార్థులు 9441083787, 7013629841, 7386529274 ఫోన్ నెంబర్‌లకు వెంటనే సంప్రదించాలని కోరారు

## ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**జగ్గంపేట, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. గండేపల్లి మండలం యల్లమిల్లి ఎస్సీ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ముందుగా ఎస్సీ కాలనీకి చేరుకున్న జ్యోతుల నవీన్‌కు ఘన స్వాగతం పలికిన దళిత మహిళలు యువత అనంతరం మాజీ ఉప ప్రధాని బాబు జగజీవన్ రావు విగ్రహానికి నవీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, కమ్యూనిటీ హాల్ లు, త్రాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అన్ని వస్తువులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు, కుంచే రాజా, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం), పెనుమర్తి భాస్కరరావు, సుంకవిల్లి రాజు, కంటిపూడి సత్యనారాయణ, దాపర్తి సీతారామయ్య, యర్రంశెట్టి బాబ్జి, శిలామంతుల వీరబాబు, మాదిరెడ్డి కృష్ణార్జున చౌదరి, మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ, చీకట్ల నాగరాజు, దేవిశెట్టి బాబ్జి, అధిక సంఖ్యలో యల్లమిల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి

### మాజీ మంత్రి కే.ఎస్ జవహర్

**మంగళగిరి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** అసత్య ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి అని మాజీ మంత్రి కే.ఎస్ జవహర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అ ప్రకటనలో "ఎన్నికల్లో ప్రజలు కొట్టిన దెబ్బకు చిన్న మెదడు చితికి జగన్ రెడ్డి ఏం మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కావడం లేదు. గత ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి.. నేడు చట్టాలు, న్యాయం అంటూ జగన్ రెడ్డి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది. వైసీపీ పీఏసీ సమావేశంలో జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆధారరహితమైనవి.. అసత్య ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ జగన్ రెడ్డి. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు, జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చేందుకు చేసే కుట్రలో భాగమేనని జగన్ రెడ్డి మాట్లాడిన మాటలు వింటే స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వం కక్షరాజకీయాలకు పాల్పడుతోందని జగన్ రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదం. గత ఐదేళ్లు రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి ప్రతిపక్ష పార్టీ నేతలపై, వారి కుటుంబ సభ్యులపై వేధింపులు, దాడులు, హత్యలు జరిగిన సంఘటనలు రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. ఇప్పుడు న్యాయపరమైన చర్యలను కక్షరాజకీయాలుగా జగన్ చిత్రీకరించడం దుర్మార్గం. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయులు అరెస్ట్ చట్టప్రకారం, ఆధారాలతో సహా అరెస్టు చేశారు. ఈ అరెస్టును రాజకీయంగా చిత్రీకరించడం ద్వారా జగన్ రెడ్డి న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కోర్టు ఏ విషయంలోనూ ప్రభుత్వ తీరును తప్పుబట్టలేదు..జగన్ రెడ్డి పాలనను కోర్టు దాదాపు వందలసార్లు పైగా తప్పుడు పట్టింది..కోర్టుతప్పుపట్టిందని చెప్పడం జగన్ తప్పుడు ప్రచారానికి నిదర్శనం. జగన్ తమ లిక్కర్ పాలసీని విప్లవాత్మకమని వైసీపీ నేతల ముందు స్టాండప్ కామెడీ షో చేశాడు. జగన్ రెడ్డి హయాంలో లిక్కర్ మాఫియా రాష్ట్రాన్ని శాసించిందని నేడు సిట్, సీఐడీ విచారణ ద్వారా తెలిసిందే. నాసిరకం మద్యం అమ్మకాలు, అక్రమ డిస్టిలరీలు, అధిక ధరలతో ప్రజలపై భారం మోపి రూ.లక్షల కోట్లు దోచుకున్నారు. జగన్ రెడ్డి మద్యం తయారు చేసిన విషపూరిత మద్యం తాగి రాష్ట్రంలో సుమారు 35లక్షల మంది అనారోగ్యానికి గురయ్యారు. 30వేల మందికి పైగా జే బ్రాండ్స్‌కు బలయ్యారు. జగన్ రెడ్డి పాలనలో కేవలం కమీషన్ల రూపంలోనే రూ.3,112 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారు. ఏప్రిల్ 18న సిట్ విచారణకు హాజరైన మాజీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్వయంగా మద్యం పాలసీ గురించి మా ఇంటిలో అనేక సార్లు చర్చలు జరిగాయని చెప్పారు. విజయసాయిరెడ్డి ఈ రోజు ట్వీట్ చేస్తూ.. ఏపీ లిక్కర్ స్కామ్‌లో నా పాత్ర విజిల్ బ్లోయర్.. తప్పించుకునేందుకే దొరికిన దొంగలు, దొరకని దొంగలు నా పేరుని లాగుతున్నారు. ఏ రూపాయి నేను ముట్టలేదు. లిక్కర్ దొంగల బట్టలు సగమే విప్పారు. వారి మిగతా బట్టలు విప్పేందుకు నేను పూర్తిగా సహకరిస్తానని చెప్పడంతో వైసీపీ అగ్రనేతల్లో అలజడి మొదలైంది. మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రదారి వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అని సిట్ విచారణలో బయట పడింది. వ్యక్తిగత కక్షలుగా చిత్రీకరించడం ద్వారా జగన్ న్యాయప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ రెడ్డి హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, అవినీతి, అక్రమ ఇసుక తవ్వకాలు, భూ కబ్జాలు వంటి అంశాలపై జగన్ సమాధానం చెప్పాలి. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, చట్టప్రకారం పాలన సాగిస్తోంది. రాష్ట్రంలో భయానక వాతావరణం ఉందని, వ్యవస్థలు దిగజారాయని చెప్పడం ద్వారా ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం జగన్ రెడ్డి చేస్తున్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగైనవి, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. జగన్ ఆరోపణలు కేవలం రాజకీయ లబ్ధి కోసం, తమ పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రమే. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా, పారదర్శకంగా పనిచేస్తోంది. ప్రజలు ఈ వాస్తవాలను గుర్తించి, జగన్ డైవర్షన్ రాజకీయాలను తిరస్కరిస్తారు" అని అన్నారు.

WWW.JANASWARAM.COM
జనస్వరం

# ముత్యాలమ్మ జాతరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ నవ జ్యోతి మిశ్రా





**చింతపల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ఏప్రిల్ 24 నుంచి 27వ వరకు జరగనున్న గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ జాతర మహొత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తుంది. ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగానే మంగళ వారం జాతర ఏర్పాట్లను ముత్యాలమ్మ ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శులు పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్పి నవజ్యోతి మిశ్రా చింతపల్లి సిఐ వినోద్ బాబు లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అందులో భాగంగా ముఖ్యమైన కూడళ్ళు, వినోద కార్యక్రమాల వేదికలను, ఆలయ పరిసరాలను పరిశీలించి కమిటీకి పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం భద్రత, ట్రాపిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు, ప్రేక్షకులు పెద్దఎత్తున విచ్చేసే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత పరంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆయన వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా నర్సీపట్నం, లంబసింగి వైపు నుండి వచ్చే వాహనాలకు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించామని, అలాగే సీలేరు, పెదవలసతో పాటు అంతర్ల నుంచి వచ్చే వాహనాలకు జిల్లా పరిషత్ అతిథి గృహం మైదానంలో, పాడేరు, అన్నవరం, చౌడుపల్లి వైపు నుండి వచ్చే వాహనాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పార్కింగును ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ 24 నుండి 27 వరకు చింతపల్లి టీ కూడలి నుండి డిగ్రీ కళాశాల వరకు రహదారిపై వాహనాలు నిలపడం నిషేధించబడిందని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే గ్రామం లోకి వాహనాలకు ప్రవేశం ఉందని, ఆ తర్వాత వచ్చే వాహనాలు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలుపుదల చేయాలని సూచించారు. పండుగ సమయంలో వ్యాపారస్తులు భక్తులకు, ట్రాఫిక్‌కు అసౌకర్యం కలిగించకుండా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శబ్దాల ద్వారా భక్తులను అసహనానికి గురిచేయడం, అసభ్య ప్రవర్తన, టీజింగ్ వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, దానికి తగినట్లుగా అన్ని చోట్ల పోలీస్ కౌంటర్లు ఏర్పాటు చేయదలచినట్లు తెలిపారు. ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో భక్తులు లేదా స్థానికులు టోల్ ఫ్రీ నంబర్ 112కు, లేదా చింతపల్లి ఎస్ఐ ఫోన్ నంబర్ 9440904238, సీఐ ఫోను నంబర్ 9440904239, అదనపు ఎస్ఐ ఫోన్ నంబర్ 9494157957లకు సంప్రదించవచ్చని సూచించారు. పండుగను భద్రతతో కూడిన శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి ప్రతి ఒక్కరు పోలీసుల సూచనలు పాటించి, ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వరరావు, ఎం వెంకటరమణ ఉత్సవ కమిటీ కోశాధికారి హరీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతాళుడు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ పత్రాల అందజేత

### బాధిత కుటుంబానికి రూ.4.20 లక్షల ఆర్థిక సాయం



**విజయవాడ, ఏప్రిల్ 22 (జనస్వరం) :** స్థానిక భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో, వైద్యానికి అవసరమైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) పత్రాలను బాధిత కుటుంబానికి అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, ఎన్డీఏ కూటమి నేతల సమక్షంలో ఈ పత్రాలు పంపిణీ చేశారు. పెజ్జోని పేట (35వ డివిజన్)కు చెందిన ఎం. సులోచన (44)కు హెర్నియా సమస్య ఉండగా, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేయగా, ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో రూ.4 లక్షల 20 వేల ఎల్ఓసీ మంజూరైంది. ఈ ఎల్ఓసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. తీవ్ర వైద్య అవసర సమయంలో తక్షణమే స్పందించి ఎల్ఓసీ మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు సాయి సుధాకర్, పైలా సతీష్, కె. శివ శర్మ, అలుగుండ్ల సుబ్బారెడ్డి, 35వ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ రాజ్, టీడీపీ డివిజన్ అధ్యక్షురాలు బుదాల నంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

## 53వ డివిజన్‌లో డ్రెయిన్ పూడికతీత పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**విజయవాడ, ఏప్రిల్ 22 (జనస్వరం) :** స్థానిక నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం 53వ డివిజన్‌లో చేపడుతున్న డ్రెయిన్ పూడికతీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో డ్రైన్ వీధి, సుబ్బరామయ్య వీధిలో జరుగుతున్న శుభ్రపరిచే పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, గాంధీహిల్ నుంచి వెహికల్ డిపో వరకు రైల్వే ట్రాక్ కింద ఉన్న పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలని, అవుట్‌ఫాల్ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కమిషనర్‌ను కోరారు. అలాగే, వెహికల్ డిపో వద్ద మురుగు నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు మోటార్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. కార్పొరేటర్ సూచనలపై స్పందించిన కమిషనర్ ధ్యానచంద్ర, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ ఇంజినీర్ సురేఖను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఈఈ సురేఖ, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


## ఎండాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోండి

### విద్యుత్ శాఖ అధికారులకు జనసేన యువ నాయకుడు హుస్సేన్ ఖాన్ విజ్ఞప్తి




**విజయనగరం, ఏప్రిల్ 22 (జనస్వరం) :** జనసేన పార్టీ యువ నాయకుడు హుస్సేన్ ఖాన్ మంగళవారం విద్యుత్ శాఖ జూనియర్ ఇంజనీర్ (జేఈ)తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో తీవ్రమైన వేడికి ప్రజలు ఇబ్బంది పడకుండా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించాలనే నిబద్ధతతో ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కోరారు. హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ మే – జూన్ నెలల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశముండటంతో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్, కాలేజీ సెలవుల సమయంలో చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు వేడితో ఇబ్బంది పడకుండా 24×7 విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన విద్యుత్ శాఖ జేఈ, ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలందించేందుకు శాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఎలాంటి ప్రతికూల పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం పట్ల ప్రాధాన్యతతో వ్యవహరిస్తున్న జనసేన యువ నాయకుడి చొరవ స్థానికంగా ప్రశంసలు అందుకుంది.ం

## ఘనంగా జనసేన నాయకురాలు, జాతీయ బీసీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటరీ మల్లికా పుట్టినరోజు వేడుకలు



**మదనపల్లె, ఏప్రిల్ 22 (జనస్వరం) :** జనసేన నాయకురాలు, జాతీయ బీసీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మల్లికా జన్మదినం సందర్భంగా పట్టణంలోని స్థానిక అమ్మచెరువు మిట్ట వెలుగు పాఠశాలలో బాలలూ, వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు, వృద్ధులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత మాట్లాడుతూ "ప్రజాసేవే ధ్యేయంగా మల్లికా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల్లో ప్రాభవాన్ని కలిగించింది" అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మల్లికా సేవాభావాన్ని ప్రశంసిస్తూ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, సుధాకర్, సిద్దయ్య, సుబ్బరాజు, మల్లికా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పొదలకూరు శ్రామికనగర్‌లో గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

### జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పర్యటన



**పొదలకూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** టౌన్ పరిధిలోని గిరిజన శ్రామికనగర్‌లో జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజన కుటుంబాలతో మట్లాడిన ఆయన, గత ఐదేళ్లుగా ఏ ప్రభుత్వం వారి బాధలు పట్టించుకోలేదని విమర్శించారు. గిరిజనులు స్థలాలు కలిగి ఉన్నప్పటికీ, ఇళ్ల పట్టాలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని వివరించుకుంటే, ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోయారు. ఈ నేపథ్యంలో "ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల్లోని గిరిజనుల సమస్యలను సమగ్రంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం" అని సురేష్ నాయుడు హామీ ఇచ్చారు. ఇళ్లకు పట్టాలు లేని వారు, పెన్షన్ రానివారు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన ప్రభుత్వ సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, చల్లా చెంచయ్య, మణి, అలాగే మండల నాయకులు బండి మనోజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఎన్ఎంలో ఘనంగా ధరిత్రి దినోత్సవం




**పాలకొల్లు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజి (స్వయంప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల ప్రిన్సిపల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి హాజరై మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ పంచభూతాలలో భూమికి అత్యంత ప్రాధాన్యత ఉందని, మన పూర్వీకులు భూమిని దేవతగా ఆరాధించారన్నారు. ప్రతి విషయంలో భూమికి అగ్ర తాంబూలమిచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఏదైనా పనిని ప్రారంభించేవారిని తెలిపారు. అందుకే భారతీయులను ప్రకృతి ఆరాధకులని అంటూ ఉంటారన్నారు. అటువంటి సంస్కృతి సంప్రదాయాలు కల భూమిని నేడు మానవుడు అనేక విధాలుగా కోతకు గురిచేస్తూ తాను కూర్చున్న కొమ్మను తానే నరుకున్న చందంగా ప్రవర్తిస్తున్నాడని, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలను ఎరచూపి భూమికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఇటువంటి పరిణామాలు భూమికి నష్టం కలిగిస్తాయని, ధరిత్రిని కాపాడవలసిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆత్మీయ అతిధిగా విచ్చేసిన వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తే మానవ మనుగడే అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డా.ఎం రామకృష్ణ, తెలుగు శాఖాధిపతి డా. బూసి వెంకటస్వామి, అధ్యాపకులు డా వి విజయలక్ష్మి, వి.శిరీష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు కర్రా జయ సరిత సహాయం



**పాలకొల్లు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** నియోజకవర్గ పరిధిలోని పాలకొల్లు మండలం వాలమర్రు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలను రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ప్రదాన కార్యదర్శి కర్రా జయ సరిత స్వయంగా కలిశారు. కలిసి వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. తమకు రెండు నెలలు నుండి జీతాలు లేవని ఇబ్బంది పడుతున్నామని ఉపాధి హామీ కూలీలు జయ సరితకు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన కర్రా జయ సరిత మంచి మనసుతో స్పందించారు. సమస్యను సంబంధిత ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్తానని, ఉపాధి హామీ కూలీల ఇబ్బందులు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండుటెండలో కష్టపడి పనిచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు సొంత ఖర్చుతో బిస్కెట్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ అందజేశారు. అదేవిధంగా రూ.6వేలు నగదును ఉపాధి హామీ కూలీలకు కర్రా జయ సరిత ఖర్చుల నిమిత్తం సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, వెంకటేశ్వరరావు, పసుపు లేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.


## మెగా డీఎస్సీ వద్దు.. స్పెషల్ డీఎస్సీ ముద్దు..

### ఎంపీపీ రమేష్



**కొయ్యూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** మెగా డీఎస్సీ వద్దు.. స్పెషల్ డీఎస్సీ ముద్దు.. అని ఎంపీపీ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన యువత, నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. అధికారంలోకి రాకముందు జీఓ నెంబర్ 3 పునరుద్దిస్తామని, లేదా ప్రత్యామాయ జీఓను ఏర్పాటు చేస్తామని, అప్పుడు హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన ప్రభుత్వంగా నిలబడిందన్నారు, 1/70 చట్టం అమల్లో ఉన్న ఎస్టీలకు 6 శాతం, గిరిజనేతరులకు 94 శాతం ఇవ్వడం ఇది ఎక్కడ న్యాయమన్నారు.


## లోకాకళ్యాణార్ధం...పరివారదేవతలకు విశేషపూజలు..



**శ్రీశైలం, ఏప్రిల్ 22 (జనస్వరం) :** శ్రీశైలక్షేత్రంలో మంగళవారాన్ని పురస్కరించుకుని ఉపాలయాలలోని పరివారదేవతలకు దేవస్థానం నిర్వహిస్తున్న సేవలతో భాగంగా లోకాకళ్యాణార్ధం సుబ్రహ్మణ్యస్వామికి, బయలు వీరభద్రస్వామికి, నందీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపించామని కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయా పూజలలో ఆలయ అర్చకులు, వేదపండితులు సాంప్రదాయబద్ధంగా లోకాసుభిక్షం కోసం శాస్రోక్తంగా మహాసంకల్పాన్ని పఠించి నిర్విఘ్నంగా పూజలు జరిగేందుకు మహాగణపతి పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామికి అర్చకస్వాములు వేద మంత్రోచ్ఛారణలతో పంచామృతాభిషేకం, తదుపరి ఫలోదకం, పాలు, పెరుగు, నెయ్యి, తేనె, కొబ్బరినీళ్లు వంటి ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. తదుపరి అర్చనలు, హారతి పూజలు చేశారు. అదేవిధంగా బయలు వీరభద్రస్వామికి పంచామృతాభిషేకం, ఫలోదక, బిల్వోదక, భస్మోదక, గంధోదక, పుష్పోదకాలతో, మల్లికాగుండంలోని శుద్ధజలాలతో శాస్రోక్తంగా అభిషేకించారు. తదుపరి ప్రత్యేక హారతులు సమర్పించారు. సాయంత్రం ఆలయప్రాంగణంలో కొలువైవున్న నందీశ్వరస్వామికి ఆగమ శాస్రానుసారంగా ప్రదోషకాల పూజలు నిర్వహించి యధావిధిగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, పురుషసుక్తం, వృషభసూక్తం వంటి పూజలు జరిపి నానబెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## వీగిపోయిన యలమంచిలి మున్సిపల్ చైర్పర్సన్ అవిశ్వాస తీర్మానం

### యధావిధిగా కొనసాగునున్న ఎలమంచిలి మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి




**యలమంచిలి ఏప్రిల్ 22 (జనస్వరం) :** యలమంచిలి మున్సిపాలిటీలో గతంలో జరిగిన ఎన్నికల్లో 25 కౌన్సిల్ మెంబర్లకు 23 వైసీపీ, 1 టీడీపీ 1ఇండిపెండెంట్ గెలుచుకున్నారు. అప్పుడు ఏకగ్రీవంగా మున్సిపల్ చైర్ పర్సన్‌గా పిల్లా రమాకుమారిని ఎన్నుకున్నారు. అయితే ఈ మధ్య మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి బీజేపీలో చేరడంతో మార్చి 27న వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు అర్రేపు గుప్త ఆధ్వర్యంలో 18 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి మున్సిపల్ కమిషనర్‌ని జిల్లా కలెక్టర్‌ని చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఏప్రిల్ 22న అవిశ్వాసానికి సమయం ఇచ్చారు. అయితే అవిశ్వాసంలో 17 మంది కౌన్సిలర్లు ఎటువైపు ఉంటే వారిదే గెలుపు ఈలోగా క్యాంప్ రాజకీయాలు జరగడంతో వైసీపీకి 12 మంది కౌన్సిలర్లే మిగిలారు. దీనిపై 22వ తేదీన మంగళవారం ఆర్డీఓ ప్రిసైడింగ్ ఆఫీసర్ వివి రమణ ఆధ్వర్యంలో అవిశ్వాసానికి ఏర్పాటు చేయగా క్యాంపు రాజకీయాలలులో ఉన్నవారు కొంతమంది, అయితే గేమ్ చేంజర్స్ అయినా వారులో కొంతమంది మిగిలింది, వైసీపీకి 12 మంది అవ్వడంతో ఇక అవిశ్వాసానికి వెళ్ళిన ఫలితం లేదని వారు ఆగిపోయారు. సమయం 10.30 నికు చూసిన ఆర్డీఓ వివి రమణ ఎవరు రాకపోవడంతో అవిశ్వాసానికి అవసరమైన కోరం రాలేదని 12 గంటలకు వరకు వాయిదా వేశారు. 12 గంటలకు కూడా ఎవరు రాకపోవడంతో అవిశ్వాస వీగిందని యధావిధిగా గత మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమాకుమారి కొనసాగుతారని ప్రిసైడింగ్ ఆఫీసర్ వివి రమణ కమిషనర్ ప్రసాద్ రాజు ప్రకటించారు.

# నిల్వ మాంసం సీజ్



కిర్లంపూడి, ఏప్రిల్ 22 (జనస్వరం) : నిల్వ ఉంచిన మాంసం విక్రయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని జగపతి నగరం పంచాయితీ కార్యదర్శి ఎన్టీఆర్ రమేష్ బాబు అన్నారు. జగపతినగరంలో మొగ్గ సింహాచలం అనే లైసెన్స్ ఉన్న మాంసం దుకాణంలో రొట్టా ఏసుబాబు అనే విక్రయ దారుడు నిల్వ ఉంచిన మాంసాన్ని అమ్ముతున్నాడనే దాస్యం ప్రభాకర్ ఫిర్యాదుతో సర్పంచ్ గుడాల శ్రీ లత రాంబాబు, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. మార్కెట్లో మాంసానికి ఉన్న డిమాండ్ కారణంగా వ్యాపారులు గతంలో అమ్ముడుపోని మాంసాన్ని నిల్వ చేసి రెండు మూడు రోజుల తర్వాత కూడా ప్రజలకు విక్రయిస్తున్నారు. అయితే మాంసాన్ని తనిఖీ ముద్ర వేసే అధికారుల కళ్లుగప్పి అక్రమ వ్యాపారులు కల్తీ మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ కొనుగోలుదారుడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు మాంసం దుకాణంలో తనిఖీలు చేపట్టగా నిల్వ ఉంచిన మేక మాంసాన్ని అమ్ముతున్నట్లు నిర్ధారణ కావడంతో సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు ఆదేశాలతో ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టికొని మాంసం దుకాణం లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు మీడియాకు తెలిపారు. మాంసం నుండి భరించలేని దుర్వాసన వెదజల్లడంతో సుమారు 5 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకుని పూడ్చి పెట్టినట్లు తెలిపారు. కుళ్లిన మాంసాన్ని తింటే ఆరోగ్యం చెడిపోతుందని, నిశితంగా పరిశీలించి కుళ్లింది కాదని నిర్ధారించుకున్నాకే కొనుగోలు చేయాలని సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి టౌన్ ప్రెసిడెంట్ మద్దాల మణికంఠ స్వామి,వార్డు మెంబెర్లు కురుమళ్ళ చిన్ని, పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

## ఉర్సా సంస్థపై తప్పుడు ప్రచారాన్ని ఖండించిన సంస్థ స్థాపకులు

అమరావతి, ఏప్రిల్ 22 (జనస్వరం) : వైసీపీ అనుబంధ మాధ్యమం 'సాక్షి' ప్రచురించిన వార్తల్లో వాస్తవం లేదంటూ ఉర్సా క్లస్టర్స్ సంస్థ స్థాపకులు తీవ్రంగా స్పందించారు. ఒక ఎకరం భూమిని కేవలం 99 పైసలకే కేటాయించారన్న వార్తలను సంస్థ ఖండించింది. తాము ప్రభుత్వ విధానాల ప్రకారం సముచిత ధరకే భూములు పొందామని స్పష్టం చేశారు. జూమ్ కాల్ ద్వారా మీడియాతో మాట్లాడిన ఉర్సా క్లస్టర్స్ ఫౌండర్ జయ్ తాళ్లూరి మాట్లాడుతూ, "ఉర్సా అనేది ఒక్కరోజులో ఏర్పడిన సంస్థ కాదు. మా వద్ద ఉన్న శ్రమ, నిపుణత, వేలాది మంది ఉద్యోగుల కృషితో ఈ స్థాయికి చేరుకున్నాం. అమెరికాలో స్థిరంగా పనిచేస్తున్న సంస్థగా మాకు గౌరవం ఉంది. భారతదేశానికి పెట్టుబడులు తీసుకురావడానికి అన్ని నిబంధనలు పాటించి, ఎఫ్‌డీఐ పాలసీ ప్రకారం భూములు పొందాం," అని వివరించారు.

**భూమి కేటాయింపు – పూర్తిగా పాలసీ ప్రకారమే :**

తమకు 56.6 ఎకరాలు ఎకరానికి రూ.50 లక్షల చొప్పున, మరో 3.5 ఎకరాలు రూ.కోట్ల చొప్పున భూములు కేటాయించబడ్డాయని స్పష్టం చేశారు. రూ.5,728.3 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో 2,000 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వచ్చామని పేర్కొన్నారు.

**"99 పైసల భూమి" అనేది పూర్తిగా అబద్ధం :**

"రెండేళ్ల గడువులోగా కార్యకలాపాలు ప్రారంభించకపోతే ప్రభుత్వం భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కుతో మాకు కేటాయింపు జరిగింది. ఇదంతా ప్రభుత్వ విధానాల ప్రకారమే జరిగింది. కానీ దీన్ని వక్రీకరించి, వక్రమార్గంగా ప్రజల్లో నమ్మకం పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారు," అని తెలిపారు.

**కేశినేని చిన్నీకి సంబంధం లేదు :**

కేశినేని చిన్నీ అనే నేతకు తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని, ఆ వ్యాపారవేత్తల పేరు చెబుతూ తమపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని సంస్థ డైరెక్టర్ సతీష్ అబ్బూరి స్పష్టం చేశారు. "మా సంస్థ ఎలాంటి బురద జల్లింపులకు లొంగదని, ఎవరికైనా సందేహాలుంటే వచ్చి ఎన్డీఏపై సంతకం చేసి అన్ని వివరాలు తెలుసుకోవచ్చు," అని అన్నారు.

**తప్పుడు ప్రచారాల వెనుక రాజకీయ దురుద్దేశం :**

వైసీపీ మద్దతుతో వెలువడుతున్న ఈ విధమైన ఆరోపణలు రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలనే కుట్రలో భాగమని, తమపై విమర్శలు చేసి ఏపీ అభివృద్ధికి అడ్డు పడతారని జయ్ తాళ్లూరి మండిపడ్డారు. "మేము యువత భవిష్యత్తును మెరుగుపరచాలన్న ఉద్దేశంతో వస్తే, మాపై నిందలు వేస్తున్నారు. ఇది బాధాకరం," అని పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వం పనితీరుతో అవిశ్వాసం వీగిపోయింది

### ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



యలమంచిలి, ఏప్రిల్ 22 (జనస్వరం) : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ కొద్ది రోజుల్లోనే అభివృద్ధి చేసి చూపించడం దానికి నిదర్శనంగా నిన్న జీవీఎంసీ ఈరోజు యలమంచిలి మున్సిపాలిటి పాలక వర్గాలు అవిశ్వాసంలో గెలుపు బాటలో నడిచారని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీలో జరిగిన అవిశ్వాస తీర్మానానికి ఎవరు హాజరు కాకపోవడంతో గత చైర్పర్సన్ కొనసాగుతారని రిటర్నింగ్ ఆఫీసర్ వివి రమణ ప్రకటించడంతో అవిశ్వాసం చిక్కుముడి వీడినట్లు అయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మూడు సంవత్సరాల నుండి మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని, ఏడాదిలోగానే కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని, కూటమి ప్రభుత్వం మాటలు చెప్పకుండా చేసి చూపిస్తుందని, ప్రజలు కూటమికే జేజేలు కొట్టడంతో అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు కూడా కూటమి వైపే మొగ్గుచూపి గెలుపు బాటలో నడిపారని విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి రాజన సన్యాసినాయుడు, కూటమి నాయకులు శ్రీరామదాసు, బొద్దపు శివ, అన్నం బాబ్జి, సోమినాయుడు, రమేష్, సతీషు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తాళ్లమాంబ అమ్మవారి పండగ

### దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



యలమంచిలి ఏప్రిల్ 22 (జనస్వరం) : మండలంలో పురుషోత్తపురం, కొత్తలి, పోతిరెడ్డి పాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో మంగళవారం తాళ్లమాంబ అమ్మవారి పండగ గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ చీర రవికా సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పురుషోత్తపురంలో, పోతిరెడ్డి పాలెం గ్రామంలో గల అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజాన శేషు, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జి, టీడీపీ అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు, కూటమి నాయకులు శ్రీరామదాసు, కొలుకులూరి విజయ్ బాబు, రాజన వెంకు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైహోం ఇండస్ట్రీస్‌లో వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు



యలమంచిలి/రాంబిల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ప్యాక్టరీ), శ్రీనగర్ కాలనీ నందు గల శ్రీశ్రీశ్రీ వ్యూహ లక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఈ నెల 20వ తేదీ నుండి నుండి 23వ తేది వరకు జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా 3వ రోజు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారి సమక్షంలో నిర్వహించారు. ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి.రామస్వామి తెలియజేసారు ఈ కార్యక్రమంలో మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు శ్రీ కుమారి దంపతలు, మైహోమ్ గ్రూప్ వైస్ చైర్మన్ వినోద్ బాబు, మైహోమ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్ రావు, మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆపరేషన్స్ పాండే, యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ఇతర అధికారులు, గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారని తెలియజేసారు.

## శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



శ్రీశైలం, ఏప్రిల్ 22 (జనస్వరం) : శ్రీభ్రమరాంభమల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన శైలజ రూ.2,00,000 లవిరాళం మొత్తాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు తగు రసీదు శ్రీస్వామివార్ల జ్ఞాపిక, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## రామ నామంతో మారుమోగిన గ్రామాలు




యలమంచిలి/రాంబిల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) : రాంబిల్లి మండలంలో శ్రీరామరక్ష రథయాత్ర మంగళవారం ప్రారంభమైంది. విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పదవ రోజుకు చేరిన రథయాత్రను పురపాలక సంఘం చైర్ పర్సన్ పీలా రామకుమారి ప్రారంభించారు. ఆర్ నర్సాపురం, కృష్ణం పాలెం, సంతపాలెం, అప్పన్నపాలెం, కొండవారిపాలెం గ్రామాలు రామ నామంతో మారుమోగాయి. కోలాటాలు తప్పుడు గుళ్ళు,హరి భజనలు, సేవ గరిడిలు అందరినీ ఆకర్షించాయి. మరొక ఐదు రోజులు పాటు రాంబిల్లి మండలంలో రథయాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజాన సన్యాసినాయుడు, వర్మగారు, వరాహ గోవిందరెడ్డి, కొల్లి అప్పారావు, పప్పు ఈశ్వరరావు, చింతకాయ రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



కిర్లంపూడి, ఏప్రిల్ 22 (జనస్వరం) : మండలంలోని రబి 2024-25 సీజన్ గాను ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంచారని మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, రైతులందరూ కూడా ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమశాతం 17 శాతం కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కె చిరంజీవి మాట్లాడుతూ రైతులెవరు దళారులను నమ్మి మోసపోవద్దని రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, మండలంలోని ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బారాషహీద్ దర్గా నెల్లూరు రూరల్‌లో ఉండడం అదృష్టంగా భావిస్తున్నా

**- సీఎం చంద్రబాబుకి బారాషహీద్ దర్గాపై ప్రత్యేకమైన గౌరవం ఉంది**

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



నెల్లూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) : రూరల్ నియోజకవర్గం పరిధిలో బారాషహీద్ దర్గాలో 85 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బారాషహీద్ దర్గా ముఖద్వారాలను మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం పెద్దల సలహాలు, సూచనలతోనే బారాషహీద్ దర్గాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధి కోసం 11 సంవత్సరాలుగా నా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని భవిష్యత్తులో కూడా నా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. రూ.85 లక్షల వ్యయంతో బారాషహీద్ దర్గా ముఖద్వారాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూలై నెలలో రొట్టెల పండుగ నాటికి ఒక ముఖ ద్వారం ప్రారంభించే విధంగా ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబుకి బారాషహీద్ దర్గాపై ప్రత్యేకమైన గౌరవం ఉందని, మంత్రి నారాయణ, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ సహాయ సహకారాలతో రాబోయే రోజుల్లో బారాషహీద్ దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చింతపల్లిలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం



చింతపల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) : ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా మండల పరిసర ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల కారణంగా మామిడి పిందెలు నేల రాలిపోయాయి. అదే క్రమంలో చింతపండు సేకరించే సీజన్ కావడంతో వర్షం కారణంగా గిరి రైతులు చింతపండు సేకరించేందుకు పడరాని పాట్లు పడ్డారు. చింతపండు తడిసి ముద్దవ్వడంతో గిరి రైతులు గిట్టుబాటు ధర తగ్గిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. చింతపల్లి పట్టణం రహదారులు జలమయమయ్యాయి. మరోవైపు అప్పటివరకు వేసవి తాపంతో విలవిలలాడిన ప్రజలు భారీ వర్షం కారణంగా ఉపశమనం పొందారు.

## వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు-2025 కరపత్రాల విడుదల

### కరపత్రాలను ఆవిష్కరించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి



నెల్లూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) : స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు-2025కు సంబంధించి కరపత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ బిల్లు ద్వారా ముస్లిం సమాజానికి లాభాలు చేకూరనున్నాయని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ మోర్చా కార్యకర్తల ద్వారా ప్రతి ఇంటిలోని ముస్లిం మహిళలకు, యువతకు ఈ సవరణ బిల్లు ద్వారా వచ్చే ప్రయోజనాలు తెలియజేయాలని సూచించారు. అలాగే, కొన్ని రాజకీయ పార్టీలు ముస్లిం సమాజాన్ని తమ స్వార్థ రాజకీయ అవసరాల కోసం ఉపయోగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ బిల్లుతో ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందనే అపోహలను ప్రజల్లోనుండి తొలగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేశ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మొగరాల సురేష్, ముస్లిం మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ లాల్ ఖాజా మస్తాన్, హిదాయతుల్లా, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు ముక్కు రాధాకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిని, జిల్లా కార్యదర్శి పరశురాం, రామలింగాపురం మండల అధ్యక్షులు మదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్య నైపుణ్యాల్లో పురోగతి


### ప్రధానోపాధ్యాయురాలు సుమ మాధురి



చింతపల్లి, ఏప్రిల్ 22 (జనస్వరం) : మండలంలోని తాజంగి గ్రామ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులో భాగంగా 10 రోజుల పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శిక్షణ ఇచ్చారు. గ్రామంలోని సచివాలయం వద్ద ఈ శిక్షణను ఎం.నీలిమ అందించారు. 10, 11వ తరగతి విద్యార్థులు ఈ శిక్షణలో భాగస్వాములయ్యారు. శిక్షణ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ ప్రాథమికాలు, డేటా ఎంట్రీ, ఆఫీస్ టూల్స్ వంటివాటిపై అవగాహన కలిగింది. మంగళవారం శిక్షణ పూర్తయిన అనంతరం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సుమ మాధురి విద్యార్థులకు శిక్షణ పొందిన ధ్రువపత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, "ఈ శిక్షణ విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయుక్తంగా నిలవడంతోపాటు టెక్నాలజీపై ఆసక్తి కలిగించడంలో ముఖ్యపాత్ర పోషించిందని" పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు.

## కష్టకాలంలో పార్టీకి సేవలు అందించిన వారికి ప్రాధాన్యత ఉంటుంది

### ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) : స్థానిక 5వ డివిజన్ సత్యనారాయణపురంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసీపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై కార్యకర్తలతో మాట్లాడి 5వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జ్/అధ్యక్షులుగా సానా సుబ్బారెడ్డిని, కోఆర్డినేటర్‌గా ఇబ్రహీంను ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ బలోపేతం దిశగా.. తామంతా కలిసికట్టుగా ఏకతాటిపై పనిచేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంచి చేసే జగన్మోహన్ రెడ్డి లాంటి సీఎంని ఎందుకు వదులుకున్నామని ఈరోజు ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉన్న కమిట్మెంట్ కలిగిన లీడర్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. పార్టీకి కష్ట కాలంలో సేవలందించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. డివిజన్ ప్రజలతో చర్చించి సుబ్బారెడ్డిని 5వ డివిజన్ ఇంచార్జిగా.. కోఆర్డినేటర్‌గా ఇబ్రహీంను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి సహకరిస్తూ డివిజన్‌లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి.. మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

# పద్యకవి మెట్టు రామచంద్ర ప్రసాద్ మృతి

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంతాపం**



**నెల్లూరు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** నెల్లూరుకు చెందిన ప్రముఖ పద్యకవి, సాహితీవేత్త, పూర్వ అధ్యాపకులు మెట్టు రామచంద్ర ప్రసాద్ మృతిపట్ల భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సంతాపం ప్రకటించారు. తన విద్యార్థి దశలో తెలుగు మాస్టారుగా రామ చంద్ర ప్రసాద్ సేవలందించారని గుర్తుచేసుకున్నారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, "అభినవ తిక్కనగా ప్రసిద్ధులైన మా తెలుగు మాస్టారు, ఆత్మీయులు మెట్టు రామచంద్ర ప్రసాద్ పరమపదించడం ఎంతో దురదృష్టకరం. వారు నా గురువు పోలూరి హనుమజ్జానకీరామశర్మ శిష్యులే కావడం విశేషం. తెలంగాణ సారస్వత పరిషత్ వారి పేరుతో ఇచ్చే అవార్డును, రామచంద్ర ప్రసాద్‌కి అందజేయడం తర్వాతి రోజుల్లో ఆయన మరణం జరగడం తీవ్ర వేదన కలిగించింది," అని పేర్కొన్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులుగా తెలుగు భాషా వికాసం కోసం చేసిన కృషిని, కళాకారులకు, సాహితీవేత్తలకు అందించిన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన రామచంద్ర ప్రసాద్ సేవలు చిరస్మరణీయమన్నారు. "ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, శిష్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను," అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

# భార్యభర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవు

**చిన్న చిన్న మనస్పర్థలు తప్ప మరేమీ లేదు**



**పులివెందుల, ఏప్రిల్ 22 (జనస్వరం) :** తమ భార్య, భర్తల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, చిన్న చిన్న మనస్పర్థలు తప్ప మరేమీ లేదని నందిపల్లి గ్రామానికి చెందిన పఠాన్ మహమ్మద్ మున్వర్ తెలిపారు. ఆదివారం నందిపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఘటనపై మంగళవారం నందిపల్లి గ్రామంలో తండ్రి పఠాన్ ఖాసీం వలి, పినతండ్రి పఠాన్ వలితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరపునాయునిపల్లి మండలం నేలతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పెద్ద బాదుల్లా కుమార్తె షీరీన్ భానుతో గత రెండేళ్ల క్రితం తనకు వివాహమైందని, అయితే తన భార్యభర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు తప్ప మరేమీ లేవన్నారు. తన భార్యను ఎప్పుడు హింసించ లేదని, అయితే కొందరు వ్యక్తులు ఈ విషయంపై రాజకీయాలు చేసి కుటుంబాలు నాశనం చేస్తున్నారని విమర్శించారు. చిన్న మాటతో భార్య షీరీన్ భాను తన పుట్టింటికి వెళ్లిందని, పెద్ద మనుషులు తీసుకుని వచ్చి సంజాయిషీ చెప్పక పోగా చిన్న బాదుల్లా ఘర్షణ జరగడానికి మూల కారణం అయినట్లు తెలిపారు. చిన్న బాదుల్లా వేంపల్లె పట్టణంలోనీ బిడాలమిట్ట ప్రాంతానికి చెందిన అబ్దుల్‌తో పాటు మరికొందరిని వెంట వేసుకుని వచ్చి తన ఇంటిపై, కుటుంబంపై మరణాయుధాలతో దాడి చేసేందుకు వచ్చారని, దీంతో నందిపల్లి గ్రామస్తులందరూ పార్టీలకు అతీతంగా.. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించడం వల్లే తమ కుటుంబం ప్రాణాలతో బయట పడినట్లు వివరించారు. తమకు ఏ రాజకీయ పార్టీ అతీతం కాదని, కుటుంబ సమస్యలను రాజకీయాలు అంటగట్టడం సరైంది కాదన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో డీఎల్‌పీఓ జ్యోతిర్మయి రివ్యూ



**పాలకొల్లు, ఏప్రిల్ 22 (జనస్వరం) :** పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారిని (డీఎల్‌పీఓ) జ్యోతిర్మయి మంగళవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ రివ్యూ సమావేశంలో నర్సాపురం డీఎల్‌పీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఓ), పాలకొల్లు, మొగల్తూరు, నరసాపురం, పోడూరు, యలమంచిలి ఈ ఐదు మండలాలకు సంబంధించిన, గ్రేడ్ 1 నుండి గ్రేడ్ 5 వరకు, బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, 5 మండలాలకు సంబంధించిన డిప్యూటీ ఎంపీడీఓలు, డీఎల్‌పీఓతో కలసి పాల్గొన్నారు. ఇంటి పన్నులు, పన్నేతరాలు, స్వమిత్వ సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో కూడా ఒకటి రెండు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మండలానికి సంబంధించి దగ్గులూరు గ్రామాన్ని స్వమిత్వ సర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పీజీఆర్ఎస్ కంప్లైంట్ లను నాణ్యతతో కూడిన విధంగా ఇవ్వాలని డీఎల్‌పీఓ సూచించారు. పంచాయతీలకు సంబంధించి గ్రంధాలయ పన్ను బకాయిలను అర్జెంటుగా చెల్లించాలని చెప్పారు. సంబదిత చలానాలను చూపించాలని కోరారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల అభివృద్ధిపై ఆరా తీశారు. పారిశుధ్యం విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమాన్ని, పాలకొల్లు డిప్యూటీ ఎంపీడీఓ, పాలకొల్లు రూరల్ పంచాయతీ ప్రత్యేక అధికారి తాళ్ళ మూర్తి బాబు పర్యవేక్షించారు. అధికారులు పాల్గొన్నారు

# 28న జీవీఎంసీ మేయర్ ఎన్నిక

**నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి**

**విశాఖపట్నం, ఏప్రిల్ 22 (జనస్వరం) :** జీవీఎంసీ మేయర్ ఎన్నికను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ మేయర్‌గా ఉన్న గొలగాని హరివెంకటకుమారి ఈనెల 19న పదవీచ్యుతులయ్యారు. ఈ నేపథ్యంలో కొత్త మేయర్‌ను ఎన్నుకునేందుకు ఈనెల 28న కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నోటిఫికేషన్ విడుదల చేశారు. మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌తోపాటు తేదీ, సమయం, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఫారం-11 ప్రకారం సమాచారాన్ని కౌన్సిల్ సభ్యులతోపాటు ఎక్స్-అఫీషియో సభ్యులందరికీ ఈనెల 24లోపు అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించించారు. 28న ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇదిలావుండగా తాజా మాజీ మేయర్ హరివెంకటకుమారికి కార్యాలయం కేటాయింపును రద్దు చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

# 26 నుంచి ఏయూ శతాబ్ది వేడుకలు ప్రారంభం

**అదేరోజు ఉదయం బీచ్‌రోడ్డులో భారీ వాక్‌థాన్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 22 (జనస్వరం) :** ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మంగళవారం సెనేట్ హాల్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వర్సిటీలోని వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్, హాస్టళ్ల వార్డెన్లు హాజరయ్యారు. ఈ నెల 26 నుంచి శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభ వేడుకలను ఎలా నిర్వహించాలన్న ఈ సమావేశంలో చర్చించారు. 26న ఉదయం బీచ్‌రోడ్డులో భారీ వాక్‌థాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వాక్‌థాన్‌లో వర్సిటీలోని వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులతోపాటు బయట విద్యా సంస్థల నుంచి విద్యార్థులు భారీగా హాజరయ్యేలా చూడాలని వీసీ సూచించినట్టు తెలిసింది. వీటితోపాటు ఇతర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు.

# పచ్చని కొండల్లో నెత్తుటేర్లు

- కశ్మీరు లోయలో ఉగ్రవాదుల నరమేధం.. పర్యాటకులపై కాల్పులు
- 26 మంది దుర్మరణం.. 20 మందికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఇద్దరు విదేశీయులు, ఇద్దరు స్థానికులు
- హైదరాబాద్‌కు చెందిన మనీశ్ రంజన్ మృతి
- మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్‌లో దారుణ ఘటన
- సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు
- పర్యాటకుల పేర్లు అడిగి మరీ కాల్పులు
- మైదానం కావడంతో తప్పించుకోవడానికీ వీల్లేక తుపాకీ గుళ్లకు బలైన పర్యాటకులు
- సమాచారం తెలియగానే రంగంలోకి జవాన్లు
- హెలికాప్టర్ల ద్వారా క్షతగాత్రుల తరలింపు
- సమీప అటవీ ప్రాంతంలో కూంబింగ్
- ఉగ్రదాడి తమ పనేనన్న టీఆర్‌ఎఫ్.. ఇది లష్కరే తాయిబా నుంచి ఉద్భవించిన ఉగ్ర సంస్థ
- కాల్పులకు తెగబడిన వారు జంతువులు: ఒమర్
- హుటాహుటిన శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా
- గవర్నర్, సీఎం, ఉన్నతాధికారులతో సమీక్ష




**పహల్గాం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (జనస్వరం) :** కశ్మీరు లోయలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో మంగళవారం పచ్చికబయళ్లలో తిరుగుతూ ప్రకృతి అందాలను చూసి పరవశిస్తున్న పర్యాటకులపై హఠాత్తుగా దాడికి తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసారన్ ప్రాంతంలోని కొండల మధ్యనున్న మైదాన ప్రాంతంలో పర్యటిస్తున్న వారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. పచ్చని కొండల్లో నెత్తుటేర్లు పారించారు. ముష్కరుల దాడిలో 26 మంది మరణించారు. మరో 20 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. మృతుల్లో ఇద్దరు విదేశీయులు (ఇజ్రాయెల్, ఇటలీ దేశస్థులు), ఇద్దరు స్థానికులు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైసారన్ ప్రాంతంలో ఉల్లాసంగా తిరుగుతున్న 40 మందికి పైగా పర్యాటకులను సమీప అడవిలో నుంచి వచ్చిన ఉగ్రవాదులు చుట్టుముట్టారు. లోయ అందాలను ఆస్వాదిస్తున్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. చాలామంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలతో అక్కడ భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండడంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసారన్‌లో కాల్పుల శబ్ధం విని పించడంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ల ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. తర్వాత 26కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాదాపు ఐదుగురు ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. "నా భర్త తలలోకి తుపాకీ గుండు దూసుకెళ్లింది. మరో ఏడుగురు కూడా తీవ్రంగా గాయపడ్డారు" అని ఓ మహిళ పీటీఐ వార్తా సంస్థకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి, కాపాడాలని వేడుకున్నారు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగానే భయంతో పరుగులు తీసినప్పటికీ.. పెద్ద మైదాన ప్రాంతం కావడంతో తప్పించుకోవడానికి దారిలేక పోయిందని మరో మహిళ చెప్పారు. ఉగ్రవాదులు పేరు అడిగి మరీ కాల్చి చంపారని మరో మహిళ వెల్లడించారు. బైసారన్‌లో ఉగ్రదాడి జరిగిన సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉన్నారు. దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను పటిష్ఠ భద్రత నడుమ పహల్గాం క్లబ్‌కు తరలించారు. అనంతనాగ్ జిల్లా యంత్రాంగం, పోలీసులు, అంబులెన్సులను ఘటనా స్థలానికి రప్పించారు. సైనికులు, సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు బైసారన్ చేరుకున్నారు. పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ముష్కరులను మట్టుబెట్టేందుకు సమీప అటవీ ప్రాంతాన్ని భద్రతాబలగాలు జల్లెడ పడుతున్నాయి. పెద్దఎత్తున ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు గాను అనంతనాగ్, శ్రీనగర్‌లో అత్యవసర కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఓ వైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత పర్యటనలో ఉండగా మరోవైపు ప్రధాని మోదీ సౌదీ పర్యటనకు వెళ్లిన సమయంలో కశ్మీరులో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడులకు పాల్పడడం గమనార్హం.

**హైదరాబాద్ వాసి మృతి :**
ఉగ్రదాడిలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి మృతి చెందారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగి మనీశ్ రంజన్ కుటుంబ సభ్యులతో కలిసి కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. బైసారన్ పర్యటనలో ఉండగా.. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆయన మృతి చెందినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత నౌకాదళ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్(26) కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. హరియాణాకు చెందిన వినయ్‌కు కోచిలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ నెల 16న ఆయనకు వివాహమైనట్లు అధికారులు చెప్పారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన ఆయన ఉగ్రదాడిలో మరణించారు. ఈ ఉగ్రదాడి తమ పనేనని 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్)' సంస్థ ప్రకటించింది. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా నుంచి టీఆర్‌ఎఫ్ ఉద్భవించింది. జమ్మూకశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇది పుట్టుకొచ్చింది. లష్కరేకు చెందిన సాజిద్ జట్, సజ్జద్ గుల్, సలీం రెహ్మానీ టీఆర్‌ఎఫ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. 2023 జనవరిలో కేంద్ర హోం శాఖ ఈ సంస్థపై నిషేధం విధించింది.

**శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా.. అధికారులతో సమీక్ష :**
కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం రాత్రికి శ్రీనగర్ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, నిఘా విభాగం డైరెక్టర్ తపన్ డేకాతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జమ్మూకశ్మీరు డీజీపీ నళిన్ ప్రభాత్ పహల్గాం ఉగ్ర దాడి వివరాలను తెలియజేశారు. పహల్గాంలో పరిస్థితిపై ఉన్నతాధికారులతో షా సమీక్షించారు. బుధవారం ఆయన ఘటనా స్థలానికి వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.

**వాళ్లు జంతువులు : జమ్మూకశ్మీరు సీఎం ఒమర్**
బైసారన్‌లో ఉగ్రదాడి ఘటన తెలిసి షాక్‌కు గురైనట్లు జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. పర్యాటకులపై కాల్పులకు తెగబడడం అత్యంత హేయమైన చర్య అని, వారు జంతువులని పేర్కొన్నారు. ఈ దాడిని ఖండించడానికి ఇంతకంటే మాటలు రావడం లేదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల సంఖ్య పెరుగుతోందని, ఆ వివరాలను ఇప్పుడే చెప్పలేమని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో జమ్మూకశ్మీరులో పౌరులపై నేరుగా జరిగిన అతిపెద్ద ఉగ్ర దాడి ఇదేనన్నారు.

**అమర్‌నాథ్ యాత్ర వేళ.. :**
అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ ఉగ్రదాడి జరగడం గమనార్హం. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జూలై 3 నుంచి ప్రారంభం కానుంది. లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం మార్గంలోనే యాత్ర 48 కి.మీ. మేర ఉంది. 14 కి.మీ. మార్గం గండేర్బల్ జిల్లా మీదుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడడం ఆందోళన కలిగిస్తోంది.

**కర్ణాటక వ్యాపారి మృతి.. :**
ఉగ్రవాదుల దాడిలో కర్ణాటకకు చెందిన స్థిరాస్తి వ్యాపారి మంజునాథ రావు మరణించారు. ఆయన భార్య పల్లవి, ఎనిమిదేళ్ల కుమారుడు క్షేమంగా ఉన్నారు. కశ్మీరు పర్యటనకు వెళ్లిన పలువురు కన్నడిగులు ప్రమాదంలో ఉండడంతో సీఎం సిద్దరామయ్య అప్రమత్తమయ్యారు. మంగళవారం సాయంత్రం సీఎస్, పోలీసు ఉన్నతాధికారులు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. కర్ణాటక వాసులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అధికారులను వెంటనే కశ్మీరుకు పంపారు. ఉగ్రదాడిలో మరణించిన మంజునాథ శివమొగ్గలోని విజయ్‌నగర్ వాసి. భార్య, కుమారుడితో కలిసి ఈ నెల 19న కశ్మీరు పర్యటనకు వెళ్లారు.

**రక్తం మరిగిపోతోంది : సిన్హా**
పహల్గాం ఉగ్రదాడి బాధ్యులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. ఈ దాడిపై యావత్ దేశం ఆగ్రహం వ్యక్తం చేస్తోందని, మన బలగాల రక్తం మరిగిపోతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు మన బలగాలు రంగంలోకి దిగాయన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

**పోయి.. మోదీకి చెప్పు..!! :**
"పో.. ఇక్కడి జరిగింది మోదీకి చెప్పు".. నన్ను కూడా చంపేయండి అని తన భర్తను చంపిన ఉగ్రవాదుల ఎదుట రోదించిన మహిళకు ఓ ఉగ్రవాది ఇచ్చిన సమాధానమిది. కర్ణాటకలోకి షిమోగకు చెందిన మంజునాథ్, పల్లవి, తమ కుమారుడు అభిజయ్‌తో కలిసి కశ్మీరు పర్యటనకు వెళ్లి పహల్గాం సందర్శనకు వెళ్లగా.. మంజునాథ్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. "ముగ్గురు, నలుగురు మాపై దాడి చేశారు. నా కళ్ల ముందే నా భర్తను కాల్చారు. ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నా భర్తను చంపారుగా నన్ను కూడా చంపేయండి.. అని వాళ్లని అడిగా.. మేము నిన్ను చంపం.. పోయి ఇక్కడ జరిగింది మోదీకి చెప్పు.. అని వాళ్లలో ఒకరు బదులిచ్చారు" దాడి అనంతరం పల్లవి చెప్పిన మాటలివి.

**హనీమూన్‌లో విషాదం... :**
"నేను, నా భర్త బేల్‌పూరీ తింటున్నాం. తుపాకీ పట్టుకున్న ఓ వ్యక్తి హఠాత్తుగా వచ్చి.. మీది ఏ మతం అని అడిగాడు. హిందువు అని నిర్ధారించుకుని నా భర్త తలపై తుపాకీ పట్టి కాల్చేశాడు".. ఈ మధ్యనే పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని అందంగా ప్రారంభించాలని హనీమూన్‌కు కశ్మీరు వచ్చి ఉగ్రదాడిలో భర్తను కోల్పోయిన యువతి ఆ షాక్ నుంచి కాస్త తేరుకున్న తర్వాత చెప్పిన మాటలివి. రక్తపుమడుగులో పడి ఉన్న భర్త మృతదేహం పక్కన విషణ్ణ వదనంతో ఆ యువతి కూర్చున్నప్పుడు తీసిన ఓ ఫొటో ఆమె ఆవేదనను వివరించింది.

